క్లుప్తంగా

వధూవరులుగా ఉత్సవమూర్తులు



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న 260వ వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం ఉత్సవమూర్తులను వధూవరులుగా తీర్చిదిద్దారు. పద్మభూషణ్ వెంపటి చినసత్యం మనువడు, మనువరాలు అనీష్, లక్ష్మీ కామేశ్వరీలు దేవేరులకు నూతన వస్త్రాలను సమర్పించగా, అర్చకులు పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మ, పెనుమూడి బాబురావు స్వామి వార్లను పెళ్లి కూతురు, పెళ్లి కొడుకుగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో శిలువమార్గం



గుడివాడటౌన్(నందివాడ): క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఉపవాస దీక్షల్లో భాగంగా శుక్రవారం ప్రపంచ శాంతిని కోరుతూ నందివాడ మండలం నూతులపాడు ఆర్సీఎం చర్చి క్రైస్తవుల ఆధ్వర్యంలో శిలువ మార్గ యాత్ర నిర్వహించారు. ఆర్సీఎం విచారణ గురువు జి. మైఖేల్, సహాయ గురువు రవి కాంత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 40 రోజులపాటు జరిగే ఈ దీక్ష దినాలలో పలు ప్రాంతాల్లో ఈ శిలువమార్గం నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ జయమ్మ, ఉపదేశకులు సెబాస్టియన్, భాస్కర్, ఆంథోని, క్రీస్తురాజు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి పింఛన్



మంత్రిపాలెం(మొవ్వ): కిడ్నీ బాధితులకు భరోసానిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్(రూ.10వేలు)కు మొవ్వ మండలం మంత్రి పాలెం గ్రామానికి చెందిన డయాలసిస్ పేషెంట్ కోటా వెంకటేశ్వర రావు ఎంపికయ్యాడు. దీర్ఘ కాలికంగా కిడ్నీ బాధితుడైన వెంకటేశ్వరరావు వలంటీర్ జోగి సురేష్, సచివాలయ కన్వీనర్ కొల్లూరి సంజయ్ చేతుల మీదుగా తొలి సారిగా నగదుని శుక్రవారం అందుకున్నాడు. కాగా మొవ్వ మండలంలో ఇప్పటికి 10మంది బాధితులు ఈ పింఛన్‌ను అందుకుంటున్నట్లు ఎంపీడీవో జి. సుధాప్రవీణ్ వెల్లడించారు.

ఆస్పత్రిలో పింఛన్ అందజేత



ముదినేపల్లి రూరల్: మంగళగిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడికి మండలంలోని బొమ్మినంపాడు వలంటీర్ శుక్రవారం వృద్ధాప్య పింఛను అందజేశారు. గ్రామానికి చెందిన కుంట్ల జనార్దనరావు కాలికి తీవ్ర గాయం కావడంతో మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పింఛన్ తీసుకునేందుకు 5తో గడువు ముగుస్తుంది. దీంతో గ్రామానికి చెందిన వలంటీర్ బోయిన శ్రావణి మంగళగిరి ఆస్పత్రిలో జనార్దనరావుకు పింఛన్ అందజేశారు.

ఆక్రమణలు నిరోధించండి



గుడివాడటౌన్ : నందివాడ మండలం కుదరవల్లి గ్రామంలో ఆక్రమణకు గురైన బీసీ శ్మశాన వాటిక స్థలాన్ని తిరిగి శ్మశానవాటికగా అప్పగించాలని కుదరవల్లి గ్రామస్తులు కోరారు. ఈ మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బీసీలకు శ్మశానవాటిక స్థలాన్ని కొంతమంది ఆక్రమించి సాగు చేస్తున్నారన్నారు. పలు మార్లు గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఆర్డీఓ చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్ల జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గుజ్జుల లాజరు, వసంతల కృష్ణ, గొర్ల శంకరరావు, నున్న వెంకట శివబ్రహ్మం, నూనె ఫణి పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

పామర్రు: స్థానిక వాసవీ వృద్ధ శరణాలయం లోని వృద్ధులకు మద్దుల సుబ్రహ్మణ్యం, నిర్మల దంపతుల కుమార్తె లక్ష్మీ పుట్టిన రోజు సందర్భంగా గురువారం అన్న దానం నిర్వహించారు. తొలుత అల్పాహార విందు, తదుపరి అన్నదానంతో పాటు పలురకాల స్వీట్లు, పండ్లను అందజేశారు.

సేద్య సౌరభం

- వ్యవసాయానికి సౌర విద్యుత్ వినియోగం
- రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండటంతో ముందుకొస్తున్న రైతులు



రాపర్ల గ్రామంలోని ఓ పొలంలో ఏర్పాటు చేసిన సౌర విద్యుత్ పలకలు

పామర్రు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి రైతులకు చక్కటి పరిష్కారం సోలార్ విద్యుత్. సాగునీటిని పుష్కలంగా చేనుకు అందించేందుకు మోటార్లు వాడటం రైతుకు అనివార్యం. దీనికి ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వమే అందిస్తున్నప్పటికీ రైతులకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అటువంటి పరిస్థితుల్లో వారికి సోలార్ విద్యుత్ అన్ని విధాలా మేలు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వం కూడా సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తుండటంతో గ్రామీణ రైతులు వీటిని ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. మెట్ట, మాగాణి ప్రాంతాల్లో చాలా మంది ఇప్పటికే సోలార్ విద్యుత్తు పలకలు ఏర్పాటు చేసుకుని పంటలు పండిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలోని పామర్రు, పెదపారుపూడి, మొవ్వ, తోట్లవల్లూరు, పమిడిముక్కల తదితర మండలాలలోని అనేక గ్రామాలలో సోలార్ పలకలను ఏర్పాటు చేస్తున్నారు. పామర్రు మండల పరిధిలోని రాపర్ల, జమీగొల్వేపల్లి, పెదమద్దాలి తదితర గ్రామాలలో రైతులు సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసుకుంటున్నారు. తమ పొలాల్లో సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు ప్రారంభించారు.

ప్రభుత్వ రాయితీలు..

సౌర విద్యుత్‌కు సంబంధించి పలకల ఏర్పాటుకు ప్రభుత్వం సుమారు 90శాతం రాయితీ అందిస్తోంది. ఈ ప్యానల్స్ ఏర్పాటుకు రూ. 5లక్షలు కాగా ప్రభుత్వం రూ. 4.48 లక్షల రాయితీ అందిస్తోంది. రైతు రూ. 52 వేలు చెల్లిస్తే తమ పొలాల్లో విద్యుత్ సరఫరాకు అవసరమయ్యే ప్యానల్స్‌ను ఏర్పాటు చేస్తారు. విద్యుత్ శాఖాధికారులు కూడా దీనిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ వీటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. సూర్యరశ్మితో పని చేసే ఈ సౌర విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన పని ఉండదు. సౌర విద్యుత్‌తో సాగుకు ఉపయుక్తంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో ఉపయోగం



సౌర శక్తి వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందవచ్చు. రెండు ఎకరాలకు నీరు అందించేందుకు ఈ సోలార్ విద్యుత్‌నే వినియోగిస్తున్నా. నిరంతరం నీరు అందుబాటులో ఉంటుంది. పొలంలో మూడు పంటలు వేసుకునే అవకాశం ఉంటుంది.

– కె. శ్రీనివాసరావు, రైతు, రాపర్ల

నీటి సమస్యకు చెక్..



సౌరశక్తితో సేద్యం చేస్తే నీటి సమస్యకు చెక్ పెట్టవచ్చు. రెండున్నర ఎకరాలకు నీరు అందించేందుకు ఈ సోలార్ విద్యుత్‌నే వినియోగిస్తున్నా. దీనితో పంటలకు ఏవిధమైన ఇబ్బంది ఉండదు. ప్రభుత్వం సబ్సిడీ అందించింది.ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డి. నాగేశ్వరరావు, రైతు, బల్లిపర్రు

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..

సౌర విద్యుత్ పరికరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సాగులో నిర్వహణ వ్యయం తగ్గుతుంది. దీనికి తోడు ప్రభుత్వాలు అధిక మొత్తంలో రాయితీలు కల్పిస్తున్నాయి. రైతులకు వీటిపై ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని పాటిస్తే మంచిది.

– జి. మోహన కృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ

కొండలమ్మ ఆలయాభివృద్ధికి కృషి



చైర్మన్ గోపి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, జెడ్పీ చైర్ పర్సన్ హారిక

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మవారి ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. శుక్రవారం నిర్వహించిన శ్రీ కొండలమ్మ ఆలయ నూతన పాలకవర్గ కమిటీ ప్రమాణ స్వీకార అభినందన సభకు జెడ్పీ చైర్ పర్సన్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండప నిర్మాణానికి తాను కృషి చేస్తానని అన్నారు.

చిరస్థాయిగా నిలిచిపోయే పాలన..

మండలంలో 17 సచివాలయాలతో పాటు ఆర్బీకేల ఏర్పాటుతో పాటు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఆర్బీకేల సిబ్బందిని ఏర్పాటు చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం నియమించిన ఈ ఉద్యోగులనే ఇంటింటికీ రప్పించి ప్రజావసరాలను తీర్చి ఇంటి ముంగిటికే పరిపాలన అందిస్తున్న జగన్ ప్రభుత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. పింఛన్లతో పాటు పేద వర్గాల జీవనోపాధికి ఆర్థికసాయం అందిస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందక నిరాశతో ఉండేవారన్నారు. నేటి ప్రభుత్వంలో ఎలాంటి ప్రజాప్రతినిధులు, అధికారుల వద్దకు వెళ్లకుండా ప్రజల ఇంటికే ఫలాలను అందిస్తున్న ప్రభుత్వం తమదని చెప్పుకునేందుకు గర్వంగా ఉందన్నారు. తొలుత కొడాలి నానితో పాటు హారిక, రాము దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో వారిని సత్కరించారు. అనంతరం చైర్మన్ గోపి దంపతులతో పాటు ఆలయ ధర్మకర్తలను ఎమ్మెల్యే కొడాలి నాని, జెడ్పీ చైర్ పర్సన్ హారిక సన్మానించారు. సదస్సులో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి ఉప్పాల రాము, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, ఈఓ సురేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు జయప్రదం చేయండి



బ్రోచర్‌లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుడివాడటౌన్ : స్థానిక కాకర్లవీధిలో వేంచేసియున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ దుడ్డు చిన్న కోరారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజులు ఈ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. 5వ తేదీ ఉదయం 8 గంటలకు స్వామి వారిని పెళ్లి కుమారునిగా, అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా చేయడం, 6వ తేదీ ఉదయం 6 గంటలకు విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, నిత్యహోమం, బలిహరణ, సాయంత్రం 5 గంటలకు స్వామివారి కల్యాణం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఉంటాయన్నారు. 7వ తేదీ పవళింపు సేవతో ఈ ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

6న నాగనాంచారమ్మ సంబరం

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరులో 6న నాగనాంచారమ్మ సంబరం జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. సంబరంలో భాగంగా 5న గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 6న ఉదయం 9 నుంచి 4గంటల వరకు సంబరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



శ్రీరంగపురంలో లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు(పమిడిముక్కల): అంతర్గత రహదారులు అభివృద్ధి పరచాలని స్థానికులు అడిగిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా తగు విధమైన చర్యలు తీసుకున్నామని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం శ్రీరంగాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేశారు. గత మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రతి ఇంటికీ చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని దీనికి నిదర్శనమే ఏపీలోని పథకాలను పక్క రాష్ట్రాల వారు ఆదర్శంగా తీసుకుని అమలు పర్చుకుంటున్నాయని అన్నారు. రానున్న కాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరలా అధికారంలోకి వచ్చే విధంగా అందరం కలిసి కృషి చేద్దామని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ మీర్జా సజ్జద్ అలీ, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కొణతం శ్రీనివాసరావు, సర్పంచ్ డి. పద్మావతి, ఉపసర్పంచ్ టి. ఇస్మాయిల్, మొవ్వ ఏఎంసీ వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



బొమ్మినంపాడులో అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడులో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ వెంకట్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేసవిలో భూతాప నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పచ్చిరొట్టపైర్ల పెంపకం వల్ల భూ తాపాన్ని నివారించవచ్చన్నారు. నవధాన్యాల ద్వారా కలిగే ప్రయోజనాలు సాగు చేయాల్సిన విధానల గురించి వివరించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ దారం సుధ, ఐసీఆర్పీ దాసి అనూష, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు గంగానమ్మ జాతర ముగింపు ఉత్సవం

పామర్రు: స్థానిక గంగానమ్మ తల్లి జాతర ముగింపు మహోత్సవాలను ఈ నెల ఐదో తేదీన అత్యంత వైభవంగా నిర్వహించేలా తగు చర్యలు తీసుకున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారిని ఆలయంలోకి ప్రవేశించిన తర్వాత భక్తులు తమ మొక్కుబడులను తీర్చుకునేందుకు అవకాశాలను కల్పించామని అన్నారు. ఆలయం చుట్టూ పశువులు, వాహనాలు, భక్తులు తిరిగేందుకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశామని అన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్ : టిడ్కో ఇళ్లకు మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మాణానికి కావలసిన భూమి సేకరణకు ఏర్పాట్లు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో ఆర్డీఓ పి. పద్మావతి, మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, తహసీల్దార్ ఆంజనేయులుతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సూచించిన మాదిరిగా ప్రధాన రహదారికి అవసరమైన భూమిని వెంటనే సేకరించాలన్నారు. త్వరలో ప్రారంభం కానున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు కావలసిన భూసేకరణలో స్థలం కోల్పోయిన వారికి సొమ్ము చెల్లించే విషయంలో తహసీల్దార్ ఆంజనేయులుతో చర్చించగా ప్రభుత్వ లెక్కల ప్రకారం వారికి చెల్లించాల్సిన మొత్తాలను వారి ఖాతాల్లో జమచేశామని చెప్పారు. రెండు రోజుల్లో సేకరించిన భూ వివరాలు కాంట్రాక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ దీనికి సంబంధించి పైప్‌లైన్‌ల తొలగింపు, మరమ్మతులు ఇతర ఏర్పాట్లకు సంసిద్ధం కావాలని రెండు మూడు రోజుల్లో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే సూచించారు. ఇదే విధంగా ఉద్యోగుల కొరకు ఎంజీజీ గృహాల నిర్మాణానికి కావలసిన భూ సేకరణ వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఇప్పటికే రెవెన్యూ అధికారులు 200 ఎకరాలు గుర్తించామని భూసేకరణ కమిటి తీర్మానం అనంతరం వారికి ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించి లే-అవుట్‌లు ఏర్పాటు చేస్తామని అధికారులు ఎమ్మెల్యే నానికి తెలిపారు.

రేపటి నుంచి లక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలు



వరహాపట్నంలో శ్రీ లక్ష్మీ నృసింహ దేవాలయం



వరహాపట్నం శ్రీ లక్ష్మీనృసింహ స్వామి

కైకలూరు: రాష్ట్రంలో 50వ ధర్మక్షేత్రంగా వరహాపట్నం శ్రీ భూసమేత శ్రీ లక్ష్మీనృసింహ దేవస్థానం విరాజిల్లుతోంది. ఈ దేవాలయంలో 121 వార్షిక బ్రహ్మోత్సవాలను దేవదాయశాఖ నిర్వహిస్తోంది. ఉత్సవాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ శుక్రవారం చెప్పారు. గ్రామానికి చెందిన కామినేని పట్టాభిరామయ్య వంశపారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. 400 ఏళ్ల క్రితం కామినేని భోగినీడు వరహాపట్నంలో స్థిరపడి పాలించారు. తర్వాత కామినేని వెంకయ్య వేదాద్రి వెళ్లి అక్కడ యోగ లక్ష్మీనృసింహుని దేవాలయం చూసి అదే విధంగా వరహాపట్నంలోనూ గుడిని నిర్మించారు. నిర్మాణ రాళ్లను వేదాద్రి, జగ్గయ్యపేట నుంచి ఎండ్ల బండ్లు, పడవలపై తీసుకొచ్చినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. కామినేని వంశీయులు 1902లో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి స్వామివారికి నిత్య పూజలు జరుగుతున్నాయి.

బ్రహ్మోత్సవాలు ఇలా..

వరహాపట్నం శ్రీ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు దేవదాయశాఖ సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 5న స్వామివారిని పెళ్లి కుమారుడిని చేయడం, అదే రోజు రాత్రి దివ్య కల్యాణం, 6న గరుడోత్సవం, 7న చందనోత్సవం, నృసింహయోగం, రథోత్సవం, 8న శేషవాహనంపై గ్రామోత్సవం, 9న అఖండ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కూచిపూడి, పంచరత్నాలు పౌరాణిక నాటకాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్ తెలిపారు.

ముగిసిన మహోత్సవాలు

కైకలూరు(కలిదిండి): మేరిమాత వార్షిక మహోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. ఈ నెల 1న ప్రారంభమైన మహోత్సవాలకు నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి వేలాది మంది క్రైస్తవ సోదరులు హాజరయ్యారు. సమష్టి దివ్య పూజాబలి సమర్పణ, జపమాల కార్యక్రమాలు జరిగాయి. చివరి రోజు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కలిదిండి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ బంటుమిల్లి యోహాను, సహాయ గురువులు లింగతోట రత్నకిశోర్, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

సుబ్బారాయుడికి విరాళం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి దాతలు శుక్రవారం విరాళమందించారు. మండలంలోని చేవూరుపాలెంకు చెందిన మేలిమి రఘునాథబాబు, కనక నాగమణి దంపతులు ఆలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళాన్ని ఆలయ కార్యాలయంలో చైర్మన్ శొంఠి నాగరాజుకు అందజేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదం



ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

అడ్డాడ(పామర్రు): విద్యార్థులలో అంతర్గతంగా దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈఎండీపీ కార్యక్రమం ఎంతగానో ఉపయుక్తం అవుతుందని హైస్కూల్ హెచ్‌ఎం డి. పద్మజ అన్నారు. మండల పరిధి అడ్డాడ గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఈఎండీపీ)లో భాగంగా 9వ తరగతి విద్యార్థులతో పాఠశాల స్థాయిలో ఈఎండీపీ ఎక్స్‌పో-2023 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ నూతన వస్తువుల ఆవిష్కరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని అన్నారు. విద్యార్థులు వారి వారి ప్రతిభను వివిధ అంశాలలో ప్రదర్శించారన్నారు. విద్యార్థులచే రూపొందించిన వివిధ రకాల వస్తువులు ఆహూతులను ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో ఈఎండీపీ జిల్లా మేనేజర్ భాను కిరణ్, ఈఎండీపీ పాఠశాల రెస్పాన్స్ పర్సన్ బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా సీఎం జగన్



వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ

కైకలూరు: రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్ పర్సన్ దేవెళ్ల రేవతి అన్నారు. ఇటీవల టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణను శుక్రవారం ఆయన నివాసం వద్ద ఆమె కలిశారు. దీంతో జయమంగళ ఆమెను ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికల్లో అఖండ మెజారిటీతో తిరిగి ముఖ్యమంత్రిగా జగన్ వస్తారని జయమంగళ చెప్పారు. కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, నాయకులు శ్రీనివాస్, బత్తుల గొప్పరాజు, ఉప్పు బాలాజీ, జి.వెంకటేష్, సురేష్, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ భుజబలపట్నం గ్రామంలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు, బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి అర్పించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని కాకరవాడ శివారు దేవపూడి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థుల బరువును సరిచూడడంతో పాటు హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించేందుకు రక్తపరీక్షలు జరిపారు. గురజ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బందితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చురుగ్గా కాలువ తవ్వకం

మండవల్లి: మండలంలోని కానుకొల్లు గ్రామంలో పంట కాలువ తవ్వకం పనులు ఉపాధి కూలీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం 62 మంది కూలీలు పని చేశారు. పనులను ఎంటీఏ నవీన్ పర్యవేక్షించారు.

కోటిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు

తోట్లవల్లూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, దేవరపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు ఎలికారెడ్డి కోటిరెడ్డి(71) అకాల మరణం పార్టీకి తీరనిలోటని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని దేవరపల్లిలో కోటిరెడ్డి మృతదేహాన్ని ఆయన శుక్రవారం సందర్శించి నివాళి అర్పించారు. కోటిరెడ్డి మృతికి కారణాలను తెలుసుకోవటంతో పాటు భార్య వెంకటరత్నకుమారి, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు మరీదు వెంకటేశ్వరరావు, నందేటి గంగాభవాని, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు మోర్ల రామచంద్రరావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

వీకేఆర్ ఫెస్ట్ ప్రారంభం



గుడివాడటౌన్ : స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన వీకేఆర్ ఫెస్ట్ 2023కి విశేష స్పందన లభించింది. కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులతో పాటు వీకేఆర్ అండ్ వీఎన్‌బీ కళాశాలకు చెందిన 850 మంది ఈ ఫెస్ట్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఫుడ్‌కు సంబంధించి 25 స్టాల్స్ ఏర్పాటు చెయ్యగా మొత్తం 2వేల మందికి పైబడి విద్యార్థులు ఈఫెస్ట్‌ను తిలకించినట్లు నిర్వాహకులు తెలిపారు.